# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :131 EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 21 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 131 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 21 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## పసడి పరుగులు

ముంబై- ప్రభాత సూర్యుడు



ప్రపంచవ్యాప్తంగా పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది. బులియన్ మార్కెట్‌లో ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి. సాధారణంగా వివాహాలు, శుభకార్యాలు, పండుగల సమయంలో బంగారం, వెండిని మహిళలు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు.

మిగతా 2లో...

### సింహ వాహనంపై యోగనరసింహుడి

## అలంకారంలో శ్రీ మలయప్ప



తిరుమల- ప్రభాత సూర్యుడు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి సింహ వాహనంపై యోగనరసింహుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది.

**సింహ వాహనం - ధైర్యసిద్ధి**


శ్రీవారు మూడో రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం' అతి ముఖ్యమయింది. సింహ రూప

మిగతా 2లో...

# ఇచ్చిందెవరు.. తెచ్చిందెవరు

### కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య సరికొత్తగా తెరమీదకు పాత పంచాయతీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముంగిటకు వచ్చిన వేళ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఒక పాత పంచాయతీ సరికొత్తగా తెరమీదకు వచ్చింది. తెలంగాణ ఆవిర్భావానికి కారణం మేమంటే మేమంటూ మూడు పార్టీలూ తెలంగాణ క్రెడిట్ ను, సెంటిమెంటును తమ ఖాతాలో వేసుకోవాలన్న విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. అయితే 2014లో తెలంగాణ ఆవిర్భావానికి అప్పటి తెరాస, ఇప్పటి బీఆర్ఎస్ ఉద్యమమే కాకుండా, తెలంగాణ ఇవ్వాలన్న అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నిర్ణయం, ఆ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీజేపీ మూడూ కారణమేనని పరిశీలకులు చెబుతున్నారు. అన్నిటికీ మించి తెలంగాణలో ఉవ్వెత్తున ఎగసిన ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్, పార్టీలకు అతీతంగా తెలంగాణ ప్రాంతా రాజకీయ నాయకులంతా తెలంగాణ కోసం నిలబడటం కారణంగానే కాంగ్రెస్ అయినా, బీఆర్ఎస్(అప్పట్లో టీఆర్ఎస్) అయినా, బీజేపీ అయినా మరెవరైనా సరే తెలంగాణ నినాదం ఎత్తుకోకుంటే రాజకీయంగా ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడింది కనుకనే తెలంగాణ సాకారమైందన్నది మాత్రం వాస్తవం. అయితే తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన తొలి ఎన్నికలో తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) అత్యధిక స్థానాలను గెలుచుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తరువాత నాలుగేళ్లకు కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీని రద్దు చేసి ముందస్తుకు వెళ్లారు. ఆ ఎన్నికలలో కూడా బీఆర్ఎస్ విజయం సాధించింది.

మిగతా 2లో...

### మహిళా

## రిజర్వేషన్లపై చర్చ షురూ




నల్గోండ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)

పార్లమెంటులో మహిళా బిల్లును కేంద్రం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో తెలంగాణలో కొత్త చిక్కొచ్చి పడింది. అధికార బిఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు నెగ్గితే 40 స్థానాల్లో మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. దశాబ్దాలుగా ఊరిస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఎట్టకేలకు లోక్ సభలో పాస్ కావడంతో హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే తెలంగాణ ఎన్నికల ముంగిట్లో ఉంది. మరో అడుగు ముందుకేసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే 119 స్థానాలకు గాను 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీలు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వడబోత

మిగతా 2లో...



# చంద్రబాబుపై వరుస కేసులు

విజయవాడ - ప్రభాత సూర్యుడు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై ఏపీ సీఐడీ వరుసగా కేసులు నమోదు చేస్తోంది. నిజానికి ఈ కేసులు ఇప్పటివి కావు. పాతవి. ఏళ్ల గడుస్తున్నా దర్యాప్తు చేస్తూనే ఉన్నారు. నిందితుల్ని అరెస్ట్ చేశారు. వారు బెయిల్ మీద కూడా విడుదలయ్యారు. కానీ కొత్తగా చంద్రబాబు ప్రధాన పాత్ర ధారి అంటూ పీటీ వారెంట్లను ఏసీబీ కోర్టులో దాఖలు చేస్తున్నారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసుతో పాటు తాజాగా ఫైబర్ నెట్ స్కాం కేసులోనూ పీటీ వారెంట్ కోసం కోర్టులో పిటిషన్ వేశారు. ఏపీ సీఐడీ చాలా ప్రణాళికతో చంద్రబాబును వీలైనంత ఎక్కువ కాలం జైల్లో ఉంచాలనుకుంటోందని తాజా పరిణామాలను బట్టి టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. దానికి తగ్గట్లుగా న్యాయ పోరాటానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కానీ అదే నిజమైతే వైసీపీ రాజకీయ వ్యూహం ప్రత్యర్థిని జైల్లో పెట్టి తాను ఎన్నికలకు వెళ్లాలనుకోవడం లాంటిదేనని.. అంటున్నారు. చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. రిమాండ్ లో ఉన్నారు. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ పూర్తయింది. రెండు రోజుల్లో తీర్పు రానుంది. మరో వైపు కస్టడీ పిటిషన్ సీఐడీ

మిగతా 2లో...

### కాకతీయలో

## ర్యాగింగ్ భూతం




వరంగల్- ప్రభాత సూర్యుడు

ర్యాగింగ్ అనే భూతం ఇప్పటికీ ఎక్కడో ఓ చోట వెంటాడుతూనే ఉంది. అయితే తాజాగా వరంగల్?లోని కాకతీయ మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థి పై ర్యాంగింగ్ కు పాల్పడి పైశాచికానందం పొందిన ఏడుగురు సీనియర్ విద్యార్థులపై వేటు పడింది. వారిపై మట్వాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఆరు గంటల పాటు కీలక సమావేశం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ వారిపై ఎట్టకేలకు వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ సంఘటన 14వ తేదీన జరిగింది. మనోహర్ అనే ఎంబీబీఎస్ సెకండ్ ఈయర్ విద్యార్థిపై పది మంది సీనియర్ విద్యార్థులు దాడి చేశారు. హాస్టల్ గదిలోకి తీసుకెళ్ళి విచక్షణా రహితంగా కొట్టారు. ఓ సీనియర్ విద్యార్థి బర్త్‌డే వేడుకల అనంతరం ఈ ఘటన జరిగడం కలకలం రేపింది. ఇక తీవ్ర గాయాల పాలైన మనోహర్?ను వెంటనే ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు.అయితే తనపై దాడి చేసిన వారిపై మనోహర్ మట్వాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అదే

మిగతా 2లో...

# పర్యాటక రంగంపై సర్కార్ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు





వైపు ఐటీ, మరోవైపు ఫార్మా రంగాల్లో దూసుకుపోతున్న మహా నగరం హైదరాబాద్ పర్యాటక రంగంలోనూ దూసుకుపోతోంది. నిజానికి ఐటీ, ఫార్మా రంగానికి కంటే ముందే హైదరాబాద్ పర్యాటక రంగంలో దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచింది. ఎన్నో చారిత్రక కట్టడాలకు నెలవుగా ఉన్న హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిస్టులు వస్తుంటారు. ఇక హైదరాబాద్ ఖ్యాతిని మరింత పెంచుతూ హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ ఎన్నో సుందర నిర్మాణాలను చేపడుతోంది. ఓవైపు ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి ఫ్లైఓవర్లు, స్కై వేలు నిర్మిస్తూనే మరోవైపు సుందరీకరణ పనులకు సైతం హెచ్ఎండీఏ పెద్ద పీట వేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్‌కు తలమానికంగా నిలిచేలా మరో అద్భుత నిర్మాణాన్ని చేపట్టింది. హుస్సేన్ సాగర్‌కు సమీపంలో ఉన్న జలవిహార్‌కు దగ్గరల్లో లేక్ ఫ్రంట్ పార్క్‌ను నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ లేక్ ఫ్రంట్ పార్క్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'హుస్సేన్ సాగర్‌కు సమీపంలో, హైదరాబాద్ నడిబొడ్డున మరో అద్భుత కట్టడం అందుబాటులోకి వచ్చింది. హుస్సేన్ సాగర్ కు సరికొత్త అందం చేరబోతోందని అన్నారు. నగర ప్రజలు అందమైన బోర్డ్ వాక్‌ని సందర్శించి ఆనందిస్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ తన ట్వీట్ లో పేర్కొన్నారు. ఓవైపు ట్రాఫిక్ జంఝాటాన్ని తగ్గించేందుకు ఫ్లైఓవర్లు, స్కై వేలు, అండర్‌పాస్ లు నిర్మిస్తూనే మరోవైపు నగర సుందరీకరణ పనులు, ఆహ్లాదాన్ని కలిగించే పార్కుల నిర్మాణం, పర్యాటక ప్రాంతాలను హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తోంది.జలవిహార్ కు సమీపంలో 10 ఎకరాల్లో హెచ్ఎండీఏ లేక్ ఫ్రంట్ పార్క్ ను నిర్మించింది హెచ్ఎండీఏ. ఈ పార్క్ ను త్వరలోనే ప్రారంభిస్తామని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ఈ పార్క్ నిర్మాణాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. రూ. 15 కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణంలో అండర్‌పాస్‌లు, స్కైవేలు, సీటింగ్ తో కూడిన వాటర్ ఛానల్స్, లేక్ వంటి అద్భుత నిర్మాణాలు ఉన్నాయి. మధ్యలో చిన్నపిల్లలకు ఆటవిడుపు కోసం పార్క్ ను కూడా తీర్చిదిద్దారు.

మిగతా 2లో...

### సింహ వాహనంపై యోగనరసింహుడి

# అలంకారంలో శ్రీ మలయప్ప

(మొదటిపేజీ తరువాయి)

దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి విజయస్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనోత్సవం ద్వారా శ్రీవారు నిరూపించారు.

**చిన్నపిల్లలకు జియో ట్యాగ్**

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే చిన్నపిల్లలు తప్పిపోకుండా టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో సదా భార్గవి, తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్యతో కలిసి జియో ట్యాగింగ్ కట్టడం ప్రారంభించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు అభయమిస్తారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### కాకతీయలో

# ర్యాగింగ్ భూతం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో యూజీసీ కూడా ఫిర్యాదు చేశాడు. తనను పదిమందికి పైగా సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసి విచక్షణారహితంగా కొట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడుయ. బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు మత్వాడ పోలీస్ స్టేషన్లో ఏడుగురు మెడికోలపై కేసు నమోదు చేశారు. అయితే ప్రాథమిక విచారణలో ర్యాగింగ్ జరిగిందని గుర్తించారు. జూనియర్ విద్యార్థిని ఉద్దేశపూర్వకంగానే హాస్టల్ గదిలోకి తీసుకెళ్లి ర్యాగింగ్ చేయడంతో పాటు విచక్షణారకంగా కొట్టారని నిర్ధారణకు వచ్చారు. అయితే ఈ క్రమంలోనే కేఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ దాస్ నేతృత్వంలో ఈరోజు యాంటీ ర్యాగింగ్ కమిటీ కీలక భేటీ జరిగింది.మొత్తం 13 మంది సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో సీనియర్ జూనియర్ విద్యార్థులను విచారించారు బాధ్యత విద్యార్థి తల్లిదండ్రులకు కూడా విచారించారు. 6 గంటల పాటు చర్చించిన అనంతరం యాంటీ ర్యాగింగ్ కమిటీ డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంది. ర్యాగింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చిన ఈ కమిటీ ర్యాగింగ్ కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను మూడు నెలల పాటు అకాడమిక్ నుండి సస్పండ్ చేయడంతో పాటు సంవత్సరం పాటు హాస్టల్ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ తెలిపారు. అంతేకాదు ఈ ఘటనలో పాల్గొన్న మరో 20 మంది విద్యార్థులకు నోటీసులు అందించారు. పోలీసుల విచారణ కొనసాగుతుందని.. అయితే ఈ విచారణలో వారి పాత్ర నిర్ధారణ అయితే వారిపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### 2 నెలలు...

# ఆరు చిరుతలు

తిరుమల- ప్రభాత సూర్యుడు

శ్రీవారి భక్తులకు చిరుతల భయం వెంటాడుతోంది..ఓ చిరుత చిక్కిందని ఊపిరి తీసుకునేలోపే.. మరో చిరుత సంచారం టెన్షన్ పెడుతోంది. ఇప్పటికే ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు చిరుతలను బంధించారు. అంతలోనే ఇప్పుడు మరో చిరుత బోనుకు చిక్కింది.. తాజాగా తిరుమల అలిపిరి కాలిబాట మార్గంలో బోనులో చిరుత చిక్కినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు ఆరు చిరుతలను బంధించినట్లైంది. లక్ష్మీనర్సింహస్వామి ఆలయం.. 2850వ మెట్టు దగ్గర బోనులో చిక్కింది ఈ చిరుత. లక్షితపై దాడిచేసిన చోటే చిక్కింది ఈ చిరుత పులి. రెండున్నర నెలల్లో ఆరు చిరుతలను పట్టుకున్నారు అధికారులు. అయితే లక్షితపై దాడిచేసిన జంతువును ఇంకా గుర్తించలేదన్నారు డీఎఫ్‌వో శ్రీనివాసులు.. జంతువులను మేం నియంత్రించం కానీ, భక్తులకు రక్షణ కల్పిస్తామన్నారు డీఎఫ్‌వో.గోవిందా గోవిందా అంటూ కొండేక్కే భక్తజనంలో చిరుత భయం మెట్టుమెట్టులోనూ కనిపిస్తోంది. శ్రీవారిని కీర్తిస్తూ కొండెక్కే భక్తులకు రెండు నెలలుగా చిరుత భయం నెలకొంది. పలు ఆంక్షలు అమల్లో ఉన్నా కొండెక్కుతున్న భక్తులు చిరుతల భయంతోనే తిరుమల యాత్ర కొనసాగిస్తున్నారు. వరుస చిరుత దాడులు, సంచారంపై టీటీడీ చేస్తున్న అలెర్ట్‌తో జాగ్రత్తలు పాటిస్తూనే ఉన్నారు. భక్తులు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలసి ఉంది. వెంట తెచ్చుకున్న తిను బండారాలను కొండల్లో పడేస్తుంటారు. అలా కాకుండా డస్ట్ బిన్స్‌లో మాత్రమే వేయాలి. ఈ అవగాహన కల్పించకపోతే భవిష్యత్తులో చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగులతోనూ ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. వెళ్లాల్సిన దారిలోనే పోవాలని, ఎప్పుడూ పక్కకు వెళ్లడానికి ట్రై చేయడానికి తాము పదే పదే భక్తులకు సూచిస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు. టాయిలెట్ వెళ్లాలన్నా సరే వాటిని ఏర్పాటు చేసిన దగ్గర మాత్రమే వెళ్లాలని, విడిగా ఎవరూ ఫారెస్ట్‌లోకి వెళ్లకూడదని హెచ్చరిస్తున్నారు.గతంలో తిరుమలకు వెళ్లే యాత్రికులు.. గట్టిగా స్వామివారి నామ స్మరణ చేస్తూ.. అరుపులు, కేకలతో.. తప్పెట్లు-తాళాలు, పాటలు పాడుకుంటూ వెళ్లేవారు. ఇప్పుడు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటకీ.. భజన చేసుకుంటూ వెళ్లేవారు కనిపించడం లేదు. కాగా కాలినడకన వెళ్లే ప్రతి భక్తుడికి, భక్తురాలికి ఇప్పటికే ఒక ఊత కర్ర ఇస్తున్నారు. శేషాచలం కొండలను బయో రిజర్వ్ ప్రాంతంగా అనౌన్స్ చేయడంతో.. జంతువులకు తిరిగే హక్కు ఉంటుందని అధికారులు వెల్లడించారు. దీంతో అటు వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా.. శ్రీవారి భక్తులకు రక్షణ కల్పించేందుకు టీటీడీ తీవ్ర కసరత్తు చేస్తుంది.

# ఇచ్చిందెవరు.. తెచ్చిందెవరు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు ముచ్చటగా మూడో సారి కూడా అధికారాన్ని కైవసం చేసుకుని హ్యాట్రిక్ సాధించాలన్న పట్టుదలతో కేసీఆర్ ఉన్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఆయన జాతీయ రాజకీయాలంటూ ఒక విధంగా నేల విడిచి సాము చేసి.. తెలంగాణ రాష్ట్ర సమితిని కాస్తా భారత రాష్ట్ర సమితిగా మార్చేసి జాతీయ పార్టీ చేసేశారు. దీంతో ఆయన తెలంగాణ సాధించాను అని చెప్పుకునే అవకాశాన్ని ఈ ఎన్నికలలో చేజేతులా జారవిడుచుకున్నారు. ఇక కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి జన్మదిన కానుకగా వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ కు అధికారం కట్టబెట్టాలంటూ తెలంగాణ సెంటిమెంటును అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నది. అదే సమయంలో అప్పట్లో పెద్దమ్మనే కాదు చిన్నమ్మనూ గుర్తుంచుకోండి అంటే కేంద్ర మాజీ మంత్రి, దివంగత సుష్మా స్వరాజ్ పార్లమెంటు వేదికగా చేసిన వినతిని గుర్తు చేస్తూ అప్పటి విపక్షం బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లనే తెలంగాణ సాకారమైందనీ, తెరాస ఆవిర్భావానికి ముందే బీజేపీ ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా మాట్లాడిందనీ కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అంటున్నారు.దీంతో ఇప్పుడు మూడు పార్టీలూ అంటే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మూడూ కూడా తెలంగాణ ఇచ్చిందెవరు? తెచ్చిందెవరు? సాకారం చేసిందెవరు? అన్న ప్రచారంతో ప్రజల ముందుకు వస్తున్నారు. ఈ ప్రచారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ ఒకింత దూకుడు ప్రదర్శిస్తోంది. 1998 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాలు జరపాలంటూ బీజేపీ డిమాండ్ చేస్తోందని కిషన్ రెడ్డి గుర్తు చేస్తున్నారు. అలాగే అధికారంలోకి రాగానే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన కేసీఆర్ సమైక్యత దినం అంటూ మాట మార్చారని విమర్శిస్తున్నారు. ఏరకంగానైతే.. 15 ఆగస్టు, 26 జనవరి నిర్వహిస్తామో.. అలాగే సెప్టెంబర్ 17ను కూడా రాష్ట్రవ్యాప్తంగా వైభవోపేతంగా జరపాల్సిన అవసరం ఉంది. కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా తెలంగాణ ఉత్సవాలు నిర్వహించామని కిషన్ రెడ్డి అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయన అంటున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో మూడు పార్టీలూ తెలంగాణ తెచ్చింది? ఇచ్చింది, సాకారం చేసింది మేమేనంటున్నారు. అయితే ప్రజలు ఏ పార్టీని విశ్వసిస్తున్నారు? తెలంగా ఆవిర్భావమై పదేళ్ల తరువాత అభివృద్ధి, తెలంగాణ ఆకాంక్షల గురించి కాకుండా ఇంకా సెంటిమెంటునే పట్టుకు వేళాడటాన్ని ప్రజలు ఎలా తీసుకుంటున్నారు అన్నది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తేలుస్తాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# చంద్రబాబుపై వరుస కేసులు

(మొదటిపేజీ తరువాయి)

వేసింది. తర్వాత ఇన్నర్ రింగ్ రోడ్ కేసు.. అలాగే.. ఫైబర్ నెట్ కేసును కూడా లైన్లో పెట్టారు. క్వాష్ పిటిషన్‌లో రిలీఫ్ వస్తే వెంటనే.. ఏసీబీ కోర్టు ద్వారా ఆ రెండు కేసుల్లో అదుపులోకి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఒక వేళ రిలీఫ్ రాకపోయినా ఇంకా మంచిదే. మరికొంత కాలం జైల్లో ఉంచుతారు. అయితే ఈ కేసుల్లో అవినీతి జరిగిందని ఒక్కటంటే ఒక్క సాక్ష్యం కూడా లేదని టీడీపీ నేతలంటున్నారు. అన్నీ కోర్టుల్లో తేలిపో యాయనని సాక్ష్యాలు చూపించలేక.. చార్జిషీట్లు కూడా దాఖలు చేయలేకపోయారని అంటున్నారు. ఫైబర్ నెట్ ప్రాజెక్టులో చంద్రబాబు ప్రధాన ముద్దాయిగా ఏసీబీ కోర్టులో ఏపీ సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించింది. ఫైబర్ నెట్ ప్రాజెక్టులో రూ.121 కోట్ల నిధులు గల్లంతయ్యాయని సిట్ చెబుతోంది. ఈ కేసు కూడా ఇప్పటిది కాదు. 2019లో పెట్టారు. 19 మందిపై సీఐడీ కేసు నమోదు చేశారు. ఏ1గా వేమూరి హరి ప్రసాద్, ఏ2 మాజీ ఎండీ సాంబశివరావుగా పేర్కొన్నారు. వారిని అరెస్ట్ చేశారు. ఆ కేసులో అందరూ బెయిల్ పై విడుదలయ్యారు. ఇంత వరకూ చార్జిషీటు కూడా వేయలేదు. కానీ ఇప్పుడు చంద్రబాబు పాత్ర గుర్తించామని పీటీ వారెంట్ కోసం కోర్టుకెళ్లారు. ఈ ప్రాజెక్టుకు టెర్రా సాఫ్ట్‌కు అక్రమ మార్గంలో టెంబర్లు ఇచ్చారని ప్రభుత్వం ఆరోపణ. ఈ కేసులో గౌరీశంకర్ అనే వ్యక్తి పాత్ర వివాదాస్పదం అయింది. ఆయనకు ప్రభుత్వం పదవి ఇచ్చి.. దొంగ సర్టిఫికెట్లు పెట్టారని తేలడంతో తప్పించింది. ఆయన వాంగ్మూలమే ఈ కేసులో కీలకమని చెబుతున్నారు. అప్పట్లోనే టీడీపీ స్కిల్ ప్రాజెక్టు తరహాలో అన్ని వివరాలను వెల్లడించింది. మరోసారి ఈ కేసులో చంద్రబాబు ప్రమేయం ఉందని సీఐడీ అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది. చంద్రబాబుపై దాఖలైన మరో కేసు అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్ మెంట్. అలైన్ మెంట్ ఇష్టారాజ్యంగా మార్చి కొంత మంది లబ్ది చేకూర్చారని వాదన. నిజానికి ఈ కేసులో అసలు ఇన్నర్ రింగ్ రోడ్ లేదు. నిర్మాణం కాలేదు. భూసేకరణ జరగలేదు. రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. కానీ మంగళగిరి ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు పెట్టారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేయలేదు. మాజీ మంత్రి నారాయణ చేసుకున్నారు.చంద్రబాబు తనపై నమోదు చేసిన అన్ని కేసుల్లోనూ ముందస్తు బెయిల్ కోసం.. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసుకున్నాయి. వాటిపై విచారణలు జరుగుతున్నాయి. అయితే వైసీపీ వ్యూహం మాత్రం చంద్రబాబును జైల్లోనే ఉంచి ఎన్నికలకు వెళ్లాలనుకుంటోందని అందుకే ఈ కేసులను బనాయిస్తున్నారని టీడీపీ నేతలంటున్నారు.

# మహిళా రిజర్వేషన్లపై చర్చ షురూ

(మొదటిపేజీ తరువాయి)

పనిలో ఉంది.ఈ దశలోనే జమిలి ఎన్నికలకు కేంద్రం సిద్ధమవుతోందంటూ వార్తలు గుప్పు మనడంతో ఎన్నికలు రెండు మూడు నెలల కాలానికి వాయిదా పడతాయానే అనుమానాలూ ఉన్నాయి. తాజాగా లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ కావడంతో కొత్త చర్చకు తెరలేచింది. రాష్ట్ర శాసన సభకు జరగనున్న ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలవుతాయా.? లేదా 2028 ఎన్నికల దాకా ఎదురు చూస్తారా..? ఒక వేళ రిజర్వేషన్లను అమలు చేసే పక్షంలో ఆ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి సమయం పడుతుంది కాబట్టి.. ఎన్నికలు ఆలస్యమవుతాయా అన్న ప్రశ్నల చుట్టూ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. తెలంగాణ శాసన సభలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గవర్నర్ నామినేటెడ్ కోటాలో మరో ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే ఉంటారు. 33శాతం రిజర్వేషన్ ప్రకారం తెలంగాణలో 39 అసెంబ్లీ నియోజక వర్గాలను మహిళలకు కేటాయించాల్సి ఉంటుందని లెక్కలు గడుతున్నారు.రాష్ట్రంలో మొత్తం సీట్లు ప్రాతిపదికగా సంఖ్య ఖరారు అయ్యాక, సబ్ రిజర్వేషన్ మేరకు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఇదే 33 శాతంలో కేటాయింపులు చేయాల్సి ఉంటుందని ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉన్న ఒక అధికారి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కోటా 39 సీట్లకు గాను, మహిళా ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉన్న స్థానాలు ఈ కోటాలో ఎంపిక చేస్తారని సమాచారం. అయితే, ఆయా జిల్లాలో ఉన్న నియోజకవర్గాల సంఖ్య, అక్కడ మహిళా ఓటర్ల సంఖ్యను బట్టి ఒక్కో జిల్లాలో కనీసం ఒక స్థానం నుంచి మూడు స్థానాల వరకు కేటాయించే అవకశాలు ఉంటాయని విశ్లేషి స్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఇందులో దేవరకొండ ఎస్టీలకు, నకిరేకల్, తుంగతుర్తి ఎస్సీలకు రిజర్వుడు స్థానాలుగా ఉన్నాయి. మహిళా ఓట్లు, మహిళా జనాభా కనీసం నాలుగైదు నియోజకవర్గాల్లో పురుషులకన్నా ఎక్కువగా ఉంది. దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ తుంగతుర్తి నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని ప్రాథమిక సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ ను అమలు కావాలంటే జరగాల్సిన తతంగానికి సమయం పడుతుందని, కచ్చితంగా అమలు చేయాల్సేందే అనుకుంటే ఎన్నికలూ ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇక మోడీతో వాట్సాప్ చేసుకోవచ్చు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రధాని నరేంద్ర మోదీ వాట్సాప్ ఛానెల్‌లో చేరారు. ఇది ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పరిచయం చేయబడిన కొత్త ఫీచర్. వాట్సప్ ఛానెల్ సహాయంతో.. ప్రజలు వన్-వే ప్రసార ఛానెల్‌ని ప్రారంభించవచ్చు. దీంతో ఒకేసారి చాలా మందితో కనెక్ట్ అవ్వొచ్చు. ఇప్పుడు మీరు వాట్సాప్‌లో కూడా ప్రధాని మోదీకి సంబంధించిన అప్‌డేట్‌లు, పోస్ట్‌లను చూడవచ్చు. ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుందో చూద్దాం.. మరి దీనిపై ప్రధాని ఏం చెప్పారో? ఇక్కడ మనం తెలుసుకుందాం..వాట్సప్ ఛానెల్ అనేది వన్-వే ప్రసార సాధనం. దీనితో, నిర్వాహకుడు టెక్స్ట్, ఫోటో, వీడియో, స్టిక్కర్, పోల్ ద్వారా ఒకేసారి చాలా మంది వ్యక్తులతో కనెక్ట్ కావచ్చు. మీరు ఈ ఫీచర్‌ని వాట్సప్ కొత్త ట్యాబ్‌లో చూడవచ్చు. అక్కడే అప్‌డేట్ చేసుకోవచ్చు. వాట్సాప్ ఛానెల్‌ని ప్రారంభించినప్పుడు.. భారత క్రికెట్ జట్టు, పలువురు బాలీవుడ్ నటులు వాట్సాప్ ఛానెల్‌తో లింక్ అయ్యారు.వాట్సాప్ ఛానెల్‌లో ప్రధాని మోదీ కూడా పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ తన క్యాప్షన్‌లో ఇలా రాసుకున్నారు. వాట్సాప్ సంఘంలో చేరినందుకు థ్రిల్డ్..! మా నిరంతర సంభాషణ ప్రయాణంలో ఇది మరో మెట్టు. ఇక్కడ కనెక్ట్ అయి ఉండనివ్వండి! కొత్త పార్లమెంటు భవనం చిత్రం ఇక్కడ ఉంది. ఈ పోస్ట్‌లో ప్రధాని మోదీ కొత్త పార్లమెంట్ భవనం చిత్రాన్ని షేర్ చేశారు.

# పసడి పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

అందుకే అందరి దృష్టి బంగారం, వెండి ధరలపై ఉంటుంది. అయితే, గత కొంతకాలం నుంచి బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగులు పెడుతున్నాయి. తాజాగా, బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. బులియన్ మార్కెట్‌లో బుధవారం ఉదయం వరకు నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55,200 ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.60,220 లు గా ఉంది. అయితే, బంగారంపై రూ.170 మేర ధర పెరిగింది. వెండి కిలో ధర రూ.300 మేర పెరిగి రూ.74,800 లకు చేరింది. కాగా.. తెలుగు రాష్ట్రాల్లో.. దేశంలోని ప్రధాన నగరాల్లో పసిడి, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.55,350 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.60,370 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.55,200, 24 క్యారెట్ల ధర రూ.60,220 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.55,500, 24 క్యారెట్ల ధర రూ.60,550, బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.55,200, 24 క్యారెట్ల బంగారం ధర రూ.60,220, కేరళలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.55,200, 24 క్యారెట్ల ధర రూ.60,220, కోల్‌కతాలో 22 క్యారెట్ల ధర రూ.55,200, 24 క్యారెట్ల ధర రూ.60,220 లుగా ఉంది.హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.55,200 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.60,220 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.55,200, 24 క్యారెట్ల ధర రూ.60,220 కి చేరింది.ఢిల్లీలో వెండి కిలో ధర రూ.74,800 ఉండగా.. ముంబైలో కిలో వెండి ధర రూ.74,800, చెన్నైలో కిలో వెండి ధర రూ.78,300, బెంగళూరులో రూ.73,250 గా ఉంది. కేరళలో రూ.74,800, కోల్‌కతాలో రూ.74,800 లుగా ఉంది. హైదరాబాద్‌లో వెండి ధర రూ.78,300, విజయవాడలో రూ.78,300, విశాఖపట్నంలో రూ.78,300 లుగా కొనసాగుతోంది.

# పర్యాటక రంగంపై సర్కార్ ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

హుస్సేన్ సాగర్‌పై విస్తరించి ఉన్న గ్లాస్ డెక్, లేక్ ఫ్రంట్ పార్క్ కోసం వేవ్ లాంటి కర్విలినియర్ డిజైన్ లు ఏర్పాటు చేశారు. పార్కులో ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన లైటింగ్ అదనపు ఆకర్షణ. పార్కులో పిల్లల కోసం ఆటస్థలాలతో పాటు పెర్గోలాస్ ఏర్పాటు చేశారు. ముంబైకి చెందిన ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ కిషోర్ డి ప్రదాన్ ఈ పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టారు.జలవిహార్‌కు సమీపంలో 10 ఎకరాల్లో హెచ్ఎండీఏ లేట్ ఫ్రంట్ పార్క్‌ను నిర్మించింది. త్వరలోనే ఈ పార్క్‌ను ప్రారంభించనున్నాము. ప్రజలంతా ఈ కొత్త నిర్మాణాన్ని సందర్శిస్తారని ఆశిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు.ఇదిలా ఉంటే ఈ ఫ్రంట్ పార్క్ నిర్మాణాన్ని హెచ్ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. రూ. 15 కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణంలో అండర్‌పాస్‌లు, స్కైవేలు, సీటింగ్‌తో కూడిన వాటర్ ఛానల్స్, లేక్ వంటి అద్భుత నిర్మాణాలు ఉన్నాయి. మధ్యలో చిన్నపిల్లలకు ఆటవిడుపు కోసం పార్క్‌ను కూడా నిర్మించారు.ఇదిలా ఉంటే.. ఈ నిర్మాణం వల్ల 35 పక్షి జాతులకు భంగం వాటిల్లుతుందని పర్యావరణవేత్తల పిటిషన్ నేపథ్యంలో గతంలో సుప్రీం కోర్టు లేక్ ఫ్రంట్ నిర్మాణంపై ఆంక్షలు విధించింది. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగించే విధంగా హుస్సేన్ సాగర్ చుట్టూ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకూడదని సుప్రీం కోర్టు గతంలోనే స్పష్టం చేసింది. అయితే జీవవైవిధ్యానికి ఎలాంటి నష్టం జరగకుండానే ఈ నిర్మాణం చేపడుతున్నట్లు హెచ్ఎండీఏ కోర్టుకు తెలిపింది. ఇలా పలు సార్లు వాదనలు ముగిసిన తర్వాత ఎట్టకేలకు లేక్ ఫ్రంట్ నిర్మాణం పూర్తయి ప్రస్తుతం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

## సంపాదకీయం

# కెనడాతో తెగతెంపులకు సిద్ధం

భారత్– కెనడా మధ్య కాక రగిలింది. విబేధాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఈ రెండు దేశాలు ఆరోపణలు, ప్రత్యారోపణలు సంధించుకుంటున్నాయి.. ఈ విషయంలో భారత్ ఓ అడుగు ముందే ఉంది. ఏకంగా భారత్‌లోని కెనడా దేశ రాయబారికి సమన్లను జారీ చేసింది. ఐదు రోజుల్లో దేశం విడిచి వెళ్లాల్సిందిగా కెనడా సీనియర్ అధికారిని ఆదేశించింది భారత్. అయిదు రోజుల గడువు విధించింది. దీనంతటికీ కారణం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్ చేసిన ప్రకటన. ఇప్పుడు రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలకు ప్రధాని ట్రూడ్ చేసిన ఓ ప్రకటన కారణంగా మారింది. భారత దౌత్యవేత్తను కెనడా బహిష్కరించడం.. ఇటు భారత్ సైతం దీటుగా స్పందిస్తూ ఆ దేశ రాయబారిపై వేటు వేయడంతో ఇరు దేశాల దౌత్య సంబంధాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత ఏజెంట్లకు సంబంధాలున్నాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన నేపథ్యంలో ఇరు దేశాలు ఇతర దేశ దౌత్యవేత్తలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడంతో భారత్–కెనడా మధ్య సంబంధాలు మరింత సంధిగ్ధంలో పడ్డాయి. ఈ తాజా పరిణామాలు రెండు దేశాల పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాలతో పాటు విద్యపై ఎలాంటి ప్రభావం చూపవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఇరుదేశాల ఆర్థిక సంబంధాలు అనేవి వాణిజ్య అంశాలపై ఆధారపడి ఉంటాయని.. అందుకే వాటిపై ప్రభావం చూపే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించి కెనడా ఒక భారతీయ దౌత్యవేత్తను బహిష్కరించిన కొన్ని గంటల తర్వాత, కెనడాకు చెందిన సీనియర్ దౌత్యవేత్తను దేశం విడిచి వెళ్లాలని భారత్ కోరినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఖలిస్తాన్ మద్దతుదారు హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను భారత ప్రభుత్వ ఏజెంట్లు హత్య చేశారని ఈ ఏడాది జూన్‌లో కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ఓ ప్రకటన చేశారు. దీంతో భారత్ సీరియస్‌గా తీసుకుంది. కెనడాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలను భారత్ నిలిపివేయడానికి ఇదే కారణం. 2023 ఆర్థిక సంవత్సరంలో రెండు దేశాల మధ్య వాణిజ్యం 8 బిలియన్ డాలర్లు అంటే 67 వేల కోట్ల రూపాయలు. భారతదేశం నుండి ఎగుమతి మరియు దిగుమతులు రెండూ సమానంగా ఉంటాయి. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఎగుమతులు, దిగుమతులు రెండూ భారీగా క్షీణించాయి. సమాచారం ప్రకారం రెండు దేశాల మధ్య పెద్దగా వాణిజ్యం లేదు. అధికారిక సమాచారం ప్రకారం, 2023 ఆర్థిక సంవత్సరంలో.. రెండు దేశాల మధ్య 8 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 67 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరిగింది. ఎగుమతి, దిగుమతులుగా విభజిస్తే భారత్ 4.11 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అంటే రూ.34 వేల కోట్లకు పైగా కెనడాకు ఎగుమతి చేసింది. ఆ వస్తువుల గురించి మాట్లాడినట్లయితే.. భారతదేశం నుంచి కెనడాకు ఫార్మాస్యూటికల్స్, ఐరన్ ఉత్పత్తులు, టెలికాం కాంపోనెంట్స్, గార్మెంట్స్, మెరైన్ ప్రొడక్ట్స్, ఆటో కాంపోనెంట్స్, ఐరన్, స్టీల్‌ని ఎగుమతి చేస్తుంది. కెనడా నుంచి భారతదేశం దిగుమతుల ఏం జరుగుతున్నాయో ఓ సారి పరిశీలిద్దాం.. అది కూడా దాని ఎగుమతులతో సమానంగా ఉంటుంది. రెండింటికీ పెద్దగా తేడా లేదు. అధికారిక లెక్కల ప్రకారం చూస్తే.. కెనడా నుంచి భారతదేశం దిగుమతులు 4.17 బిలియన్ డాలర్లు అంటే 35 వేల కోట్ల కంటే కొంచెం తక్కువ. కెనడా నుంచి భారతదేశం బొగ్గు, ఎరువులు, పప్పులు, పల్ప్, అల్యూమినియం వంటి వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. నిపుణులను విశ్వసిస్తే, భారతదేశం ఇతర స్నేహపూర్వక దేశాల నుంచి కూడా ఈ వస్తువులను దిగుమతి చేసుకోవచ్చు. ఈ వస్తువులన్నింటికీ భారతదేశానికి ప్రత్యేకంగా కెనడా అవసరం లేదు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో అంటే 2024లో.. కెనడాకు భారతదేశం నుంచి ఎగుమతుల్లో సంవత్సరానికి భారీ క్షీణత ఉంది. అధికర గణాంకాల ప్రకారం, ఈ సంఖ్య 20 శాతం కంటే ఎక్కువ తగ్గి 1.24 బిలియన్ డాలర్లకు అంటే 10 వేల కోట్ల కంటే కొంచెం ఎక్కువ. అధికారిక సమాచారం ప్రకారం, అదే సమయంలో, దిగుమతుల్లో 6.39 శాతం క్షీణత ఉంది . ఈ సంఖ్య 1.32 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 11 వేల కోట్ల రూపాయలకు తగ్గింది. ఇదిలా ఉండగా.. జి20 సదస్సు వేళ చోటుచేసుకున్న కొన్ని రాజకీయ పరిణామాలు మాత్రం స్వేచ్ఛా వాణిజ్య సంప్రదింపులకు అడ్డుకట్ట పడినట్లే అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు జరగాల్సి ఉన్నప్పటికీ అవి తాత్కాలికంగా నిలిచిపోయినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందేభారతదేశం– కెనడాల మధ్య తాజా ఉద్రిక్తతలు రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులపై ప్రభావం చూపే అవకాశం లేదని నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే ఆర్థిక సంబంధాలు వాణిజ్యపరమైన పరిశీలనల ద్వారా కొనసాగుతుంటాయనేది నిర్వివాదాంశం.

## నేడు అంతర్జాతీయ శాంతి దినోత్సవం

అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్నిప్రతి యేటాది సెప్టెంబరు 21న జరుపుతుంటారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం మేరకు 1982 సెప్టెంబరు 21వ తేదీ నుంచి ఈ శాంతి దినోత్సవాన్ని జరుపుతూ వస్తున్నారు. అంతర్జాతీయంగా కాల్పుల విరమణ, అహింస, శాంతి, సోదర భావాల సాధన కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి అల్లర్లు, ఘర్షణలు లేకుండా శాంతియుత జీవనానికే ప్రజానీకం మొగ్గుచూపుతోంది. శాంతి దినోత్సవం రోజున కపోతాలు (తెల్లని పావురాలు) ఎగురవేసి శాంతిపట్ల తమకున్న విశ్వాసాన్ని తెలియజేస్తుంటారు అనేక దేశాధినేతలు. వ్యక్తులు, సంస్థలు, దేశాలు ప్రపంచ శాంతికోసం తమ వంతు ప్రయత్నాలు, ఆచరణీయ కార్యక్రమాలు చేపట్టడానికి అంతర్జాతీయ శాంతి దినోత్సవం పాటిస్తారు. ప్రపంచంలో ఉన్న అన్ని ఖండాల నుంచి చిన్నారులు పంపిన నాణాలను కలిపి విరాళంగా వచ్చిన మొత్తంతో అసోసియేషన్ ఆఫ్ జపాన్ వారు ఐరాసకు ఒక గంటను బహూకరించారు. న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయం ఆవరణలోని వెస్ట్‌కోర్ట్ తోటలో ఈ గంటను ఏర్పాటుచేశారు. ఏటా శాంతి దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలను ఈ గంటను మోగించిన తర్వాత దీని సమీపంలోనే నిర్వహిస్తారు. దేశాలు, జాతులు, సమూహాలు తీవ్ర ఘర్షణల్లో మునిగి తేలుతున్నప్పటికీ ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా కాల్పుల విరమణ ప్రకటిస్తూ శాంతికోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రపంచానికి శాంతిని ప్రబోధించేలా శాంతి గంటను మోగిస్తారు. 1981లో సెప్టెంబర్ 21న ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం ప్రారంభ సందర్భంగా కోస్టారికా ఒక తీర్మానం సమర్పించింది. దాని ప్రకారం ఏటా సెప్టెంబర్ 21వ తేదిన ప్రపంచ శాంతి దినంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది.

# రైతులకు నూతన రుణాల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

- సెప్టెంబర్ చివరి వరకు రుణమాఫీ జరిగిన ప్రతి ఒక్కరైతుకు నూతన రుణాలు అందించాలి
- 178 మంది రైతు ఖాతా వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించాలి
- వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతు రుణమాఫీపై క్షేత్రస్థాయి అవగాహన
- స్వశక్తి రుణాల రికవరీ పై దృష్టిసారించాలి
- బ్యాంకర్లతో డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి - ప్రభాత సూర్యుడు




జిల్లాలో లక్ష రూపాయల రుణమాఫీ జరిగిన రైతులందరికీ ప్రణాళికా బద్ధంగా నూతన రుణాలు పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం ప్రగతి భవన్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లతో డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు లక్ష రూపాయల పంట రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తుందని, రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు అర్హత మేరకు నూతన రుణాలు పంపిణీ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మన జిల్లాలో ఇప్పటివరకు 37 వేల 910 మంది రైతులకు 211 కోట్ల 92 లక్షల రూపాయల రుణమాఫీ సొమ్ము వారి రుణ ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని, జిల్లాలోని 3 వేల 795 మంది రైతుల రుణ ఖాతాలు క్లోజ్ అయినందున రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ జమ చేయలేకపోయామని, ఆధార్ నెంబర్ ఆధారంగా 3 వేల 617 మంది రైతుల రైతు బంధు ఖాతా వివరాలు సేకరించి, అందులో రుణమాఫీ సొమ్ము జమ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో దాదాపు 178 మంది రైతుల బ్యాంకు ఖాతా వివరాలు లభించడం లేదని, సదరు రైతుల వివరాలు మండలాల వారీగా వ్యవసాయ అధికారులకు అందించామని, వ్యవసాయ విస్తరణ అధికారులచే క్షేత్రస్థాయిలో పరిశీలించి సదరు రైతుల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి త్వరితగతిన లీడ్ బ్యాంక్ మేనేజర్ ద్వారా బ్యాంకర్లకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయడంతో పాటు రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు నూతన రుణాలు పంపిణీపై సైతం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సెప్టెంబర్ చివరి నాటికి రుణమాఫీ జరిగిన రైతులందరికీ నూతన రుణాలు పంపిణీ జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్ 11 నాటికి 1242 స్వశక్తి సంఘాలకు రూ.87 కోట్లు, మెప్మా కింద 125 స్వశక్తి సంఘాలకు దాదాపు రూ.7 కోట్ల 99 లక్షలు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 41 శాతం పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో బ్యాంకర్లకు అందాల్సిన గ్రూపు వివరాలు వెంటనే అందజేసేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పట్టణాలలో సైతం మెప్మా బృందాల వివరాలు బ్యాంకులకు అందించి రుణాలు మంజూరి జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 604 స్వశక్తి సంఘాలు రూ.3.53 కోట్ల ఎన్ పీ.ఏ ఉందని అధికారులు వివరించారు. జిల్లాలో రుణాల రికవరీ పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ , కార్పొరేషన్ కు సంబంధించి యూనిట్లు గ్రౌండ్ చేయని పక్షంలో ప్రభుత్వం విడుదల చేసిన సంబంధిత సబ్సిడీ సొమ్ము తిరిగి ప్రభుత్వానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. అనంతరం 2023–24 వార్షిక ఋణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, వివిధ బ్యాంకు మేనేజర్లు , సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి- ప్రభాత సూర్యుడు



రాబోయే అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా నోడల్ అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ... ఓటరు జాబితా సవరణ పూర్తి చేసుకొని అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ మొదటి రెండు వారాల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన మానవ వనరులు సిద్ధం చేయాలని, మన జిల్లాలో భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం కేటాయించే సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జరగాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి పంపిణీ పకడ్బందీగా జరిగేలా ప్రణాళికలు తయారు చేయాలని, ఎన్నికల నేపథ్యంలో వినియోగించే వాహనాల పరిశీలించి సర్టిపై చేయాలని అన్నారు. పోలింగ్ అధిక శాతం నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చు పై పకడ్బంది నిఘా ఉండాలని కలెక్టర్ తెలిపారు. సి విజల్ వినియోగం పై ప్రచారం కల్పించాలని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను పకడ్బందిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మీడియా సర్టిఫికెషన్ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు, పేయిడ్ న్యూస్, మీడియా సెంటర్ ఏర్పాటు తదితర అంశాల పై పాత్రికేయులకు ముందుగా సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో 1950 నెంబర్ కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల ఓటర్లు పోలింగ్ లో పాల్గోనేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ రాములు, డి ఆర్ డి ఓ పురుషోత్తం, జెడ్పి సీఈవో విజయలక్ష్మి, సిపిఓ శామ్యూల్, డీఈఓ రామ్ కుమార్, డీఎఫ్ఓ అవినాష్, డి పి ఆర్ ఓ శ్రీధర్, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ వెంకటేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి సునీత, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ శ్రావన్, రవాణా అధికారి సంధాని , తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పాలాభిషేకం

మంథన్ని- ప్రభాత సూర్యుడు

మహిళా లోకానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలని డిమాండ్ తోటి గత దశాబ్దాలుగా చేస్తున్నటువంటి ఉద్యమానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ సారాధ్యంలో ఆ దశాబ్దాల కళ నేటితో నెరవేరి మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించిన సందర్భంగామంథని బీజేపీ పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం మంథని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో లో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా మంథని మండల అధ్యక్షురాలు బోసెల్లి మౌనిక, మంథని పట్టణ అధ్యక్షురాలు కన్నూరి పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి పార్టీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు మోడీ కి పాలాభిషేకం చేశామన్నారు. గతంలో పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ సారథ్యం వహించిన యూపీఏ ప్రభుత్వం మహిళా బిల్లు విషయంలో ముందడుగు వేయకపోవడం పై మహిళా లోకానికి కాంగ్రెస్ పార్టీ, టిఆర్ఎస్ కి ఉన్న చిత్తశుద్ధి ఎంతుందో అర్థమైందని అన్నారు. నేడు చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిన ఘనత, ముస్లిం మహిళలకు త్రిబుల్ తలాక్ బిల్లుతో మహిళా సాధికారత కోసం కృషి చేసిన ఘనత కేవలం నరేంద్ర మోడీ కే దక్కిందని, బిజెపి అంటేనే దేశం కోసం ధర్మం కోసం పనిచేసే ఏకైక నీతి నిజాయితీగల పార్టీ అని మరొకసారి రుజువైందని అన్నారు. ఈ రిజర్వేషన్ల బిల్లు ఆమోదింప చేసుకోవడమే దీనికి నిదర్శనం అని అన్నారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీని మహిళా సోదరీమణులు తప్పకుండా ఆదరిస్తారని రానున్న ఎన్నికల్లో నరేంద్ర మోడీ పరిపాలన కేంద్రంలో మరోసారి, తెలంగాణలో ఈసారి బిజెపి అదేవిధంగా మంథనిలో బిజెపి పార్టీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్, బిజెపి ముత్తారం మండల అధ్యక్షులు పేయ్యల కుమార్, మంథని ఇంచార్జ్ తోట మధుకర్, పట్టణ ఇంచార్జ్ సబ్బని సంతోష్, బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ తొట్ల రాజు, బిజెపి సీనియర్ నాయకులు కోరబోయిన మల్లికార్జున్, చిదురాల మధుకర్ రెడ్డి, రేపాక శంకర్, సుధాకర్, రవి, బొసెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## వడగండ్ల వానకు నష్టపోయిన
# రైతులకు నష్టపరిహారం అందజేత
### ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**యాచారం - ప్రభాత సూర్యుడు**

ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి బుధవారం నష్టపరిహారం అందజేశారు. యాచారం మండల పరిధిలోని మంథన్ గౌరెల్లి, కేసి తాండ గ్రామాలలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాల కారణంగా పంట నష్టపోయిన 621 మంది రైతులకు 53.11 లక్షల రూపాయలు నష్ట పరిహార చెక్కులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతుల కష్టాలకు అండగా నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి కిషన్, ఎంపీటీసీ జ్యోతి అరవింద్ నాయక్, ఎంపీపీ కొప్పు సుకన్య భాష, జెడ్ పి టి సి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, యాచారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ టి రాజేందర్ రెడ్డి, కారంగ యాదయ్య, యాట శ్రీనివాస్, గ్రామ శాఖ యువత అధ్యక్షులు సోమేశ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిరెడ్డి కిషన్ రెడ్డిని
# ఎదుర్కొనే సత్తా ఏ పార్టీకి లేదు
### బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఉడుతల ప్రవీణ్ గౌడ్

**యాచారం - ప్రభాత సూర్యుడు**




ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని ఎదుర్కొనే సత్తా ఏపార్టీకి కూడా లేదని, మళ్ళీ నియోజకవర్గంలో మంచి రెడ్డి గెలుపు ఖాయమని, మంత్రి పదవి రావడం తథ్యమని మేడిపల్లి,నక్కర్త బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఉడుతల ప్రవీణ్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు నేరుగా చేరుతున్నాయని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి పథకాలను లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు.

# గణనాధుని సేవలో దండెం రాం రెడ్డి
## కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని టి పి సి సి కార్యదర్శి, ప్రచార కమిటీ సభ్యులు దండెం రాం రెడ్డి పెద్ద అంబర్ పేట్ లోని గణేష్ మండపాలను బుధవారం సందర్శించారు. నవభారత్ మరియు కింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధులను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు జీవితాల్లో ఎదుర్కొంటున్న విఘ్నాన నుండి విముక్తి పొంది, ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోషా గిరీష్, మహదేవ్ సింగ్, చక్రపాణి, శేకర్, విజయ్, బాలరాజ్, కరణ్ సింగ్, మల్లారెడ్డి, నర్సింహా, సర్సింగ్ రావు, సురకంటి రాజశేఖర్ రెడ్డి, జంగారెడ్డి, వెంకయ్య చారీ, జంగయ్య గౌడ్, బ్రహ్మచారి, శంకర్, నరేందర్ చారీ, ప్రవీణ్ గౌడ్, ప్రదీప్ గౌడ్, మనీష్ గౌడ్, నీరజ్ గౌడ్, ప్రీతమ్ గౌడ్ మరియు మహిళలు, దంపతులు, పిల్లలు, భక్తులు పాల్గొన్నారు.



# వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం
### రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ






**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు**

రాబోవు సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు అంబేద్కర్ కూడాలిలో గల అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి సభలో సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ స్కీములకు గాను కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలు అద్భుతంగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం, ముఖ్యంగా తెలంగాణ మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్యారెంటీ స్కీములను అమలు చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో, ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగుర వేస్తామని, అందుకు తెలంగాణ మహిళ లోకం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ కొత్త హార్దిక ప్రవీణ్ గౌడ్, తుర్కయంజల్ మున్సిపల్ చైర్మన్ మల్ రెడ్డి అనురాధ రా%శీ%రెడ్డి, వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, అబ్దుల్లాపూర్మెట్ ఎంపిపి బుర్ర రేఖ మహేందర్ గౌడ్, తుర్కయంజాల్ మున్సిపల్ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, బ్లాక్ అధ్యక్షురాలు సుబ్బురు మల్లికా పాండు,స్థానిక కౌన్సిలర్ ఆకుల మమతా ఆనంద్, యాచారం మండలం మాజీ అధ్యక్షురాలు జ్యోతి శ్రీనివాస్ నాయక్,మాధవి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు శిల్ప, రత్నకుమారి,మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు సంతోష,జ్యోతి,ఉమా, సంతోష, లక్ష్మి, జ్యోతి, భాను, ప్రసన్న, ఐలమ్మ, యాదమ్మ, సంతోష, అండాలు, అమృత, సుకన్య నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

● కాంగ్రెస్ పార్టీలో చేరిన అయ్యవారి గూడ గ్రామస్తులు ● వివిధ పార్టీలకు చెందిన 20 కుటుంబాలు చేరిక ● టిపిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి

**యాచారం - ప్రభాత సూర్యుడు**



ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి. యాచారం మండలం అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి 20 కుటుంబాలకు పైగా టిపిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ తీసుకొచ్చిన 6 గ్యారంటీలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కందికంటి లక్ష్మయ్య,నర్సింహా, కిష్టయ్య, అంజయ్య,పాండు, యాదయ్య, పంది రాములు, కొప్పు నర్సింహ,యాదయ్య,ములి జంగయ్య, ములి కిష్టయ్య,పంది యాదగిరి, జగన్, గణేష్,శివ , చరణ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు , పిసిసి ప్రధానకార్యదర్శి చిలుక మధుసూధన్ రెడ్డి,గ్రామ సర్పంచ్ గంగా లచ్చిరాం నాయక్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ నాయక్ ,మండల అధ్యక్షులు మస్కు నర్సింహా నాయకులు పసుపుల నర్సింహా, సామ మల్లయ్య, నక్క పాండరి,పోలమోని జంగయ్య,రామకృష్ణ యాదవ్,సాటు వెంకటయ్య, సామ శ్రీనివాస్, రమేష్ మోతీలాల్,లచ్య,శంకర్, దేవరం , లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణ టాప్

■ 15.64 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనుల శంకుస్థాపన ■ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**



దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ సారధ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. 15.64 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంచిరెడ్డి శంకుస్థాపన చేశారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కేంద్రంలో చెక్ పోస్ట్ నుండి కొహెడ వెళ్లే దారిలో చాకరి వాగు, చెన్నవాగుపై 8.45 కోట్ల రూపాయల నిధులతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జ్ కు ఎమ్మెల్యే కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం 4.50 కోట్ల రూపాయల నిధులతో పెద్ద అంబర్ పేట్ - పసుమాముల బీటీ రోడ్డు విస్తరణ పనులను, తట్టి అన్నారంలోని 1.38 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి, కుంట్లూర్ లో 1.31 కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు మరియు వరద నీటి కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దూసుకుపోతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కౌన్సిలర్ సిద్దెంకి క్రిష్ణా రెడ్డి, కౌన్సిలర్లు వద్దేపల్లి విద్యావతి విజయేందర్ రెడ్డి, పాశం అర్చన దామోదర్ రెడ్డి, తొండాపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, కందాడి అనుపమ సుప్రసేనారెడ్డి, జోర్క గీత శ్రీరాములు, చెవుల హరిశంకర్, చల్లూరి మురళీధర్ రెడ్డి, దండెం కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు చెరుకూరి రేణుక జగన్, నాయకులు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి (చింటు), మాజీ అధ్యక్షులు ఈదమ్మల బలరాం, కళ్లెం ప్రభాకర్ రెడ్డి, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, గౌని భాస్కర్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ సత్తార్, యువజన నాయకులు పాలడుగు నాగార్జున, బంగారు శశి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215